# గ్రహబలం




శనీశ్వరాలయం భక్తజనసందోహంతో కిటకిటలాడుతోంది.

గుడిముందు టెంకాయలు, అరటిపళ్లు విరివిగా అమ్ముడుపోతున్నాయి.

పాతికేళ్లయువకుడొకడు సైకిలుమీదవచ్చి గుడిముందు ఆగాడు. శనీశ్వరునికి కొబ్బరికాయ అభిషేకం చేయించి బయటపడ్డాడు. తను ఆలయప్రాంగణంలో పార్కుచేసిన సైకిలుకానరాకపోవడంతో కంగారుగా అటు ఇటు చూశాడు.

"ఏమిటి నాయన వెతుకుతున్నావు?" అడిగాడు అరుగుమీద ఆశీనుడైయున్న యోగానందస్వామి. అతడిమెడలో రుద్రాక్షలు, శరీరంమీద విభూతిరేఖలు విరాజిల్లు తున్నాయి.

"నా సైకిలు కనిపించడంలేదు. ఇక్కడే ఉంచాను" అదుర్దా ధ్వనిస్తోందతడి కంఠంలో.

"నీ నామధేయం?"

"పాపారావు"

"జన్మరాశి"

"మీనం"

"వృత్తి"

"సైకిలుపోయి నేనేడుస్తూ ఉంటే మధ్యలో మీ ప్రశ్నలేమిటండీ"

"చిరాకు పడకు నాయనా కారణముండే అడుగుతున్నాను. నీ గ్రహబలం బాగోలేదు. ఏలినాటిశని నిన్ను పట్టిపీడిస్తోంది. గురు వీక్షణవల్ల శనితీక్షణత కాస్త తగ్గుముఖం పట్టింది. పోయిన వస్తువు గురించి విచారించకు ఇక ముందు ఇంతకంటె విలువైన వాహనాన్నే సంపాదించుకోగలుగుతావు ఇది సత్యం"

ఆలోచనలో పడ్డాడు పాపారావు. అతడి మాటలు అక్షరాల నిజమనిపిస్తోంది ఈ మధ్య తన జాతకమేమి బాగుండలేదు శనిప్రభావమో ఏమో చేస్తున్న ఉద్యోగ ప్రయత్నాలన్నీ

విఫలమవుతున్నాయి. నేటితో శని సైకిలురూపంలో విరగడైందని భావించి మరికిమ్మనకుండ వెళ్ళిపోయాడు.

భూదేవి మరోమారు సూర్యభగవానుని చుట్టూ ప్రదక్షణం చేసింది.

పాపారావు మోటారుబైకుమీద ఆలయాకొచ్చాడు.

అరుగుమీద చతికిలబడిఉన్న యోగానందస్వామివారిని చూస్తూనే చేతులు జోడించాడు.

"ఆయుష్మాన్‌భవ" ఆశీర్వదించాడు యోగానందస్వామి.

"మీరు చెప్పినదాంట్లో వీసంపొల్లుపోలేదు స్వామి. నన్ను రక్కసిలా పట్టిపీడిస్తున్న శనివిరగడవడంతో నాకు మంచి ఉద్యోగంమైంది మోటారుబైక్‌కూడా కొనుక్కున్నాను. మీరు మహానుభావులు. మీ వాక్కువేదవాక్కు" అంటూ కీర్తించాడు పాపారావు.

"చాలా సంతోషం వెంటనే దైవదర్శనం చేసుకో"

"అలాగే స్వామి ఆ పనిమీదే వచ్చాను"

"శుభమస్తు"

అర్చన ముగించుకొని బయటపడ్డ పాపారావుకు తనబైకు కానరాకపోవడంతో ఆందోళన చెందాడు.

"స్వామీ!... నా బైకు"

"చింతించకు ఇప్పుడు నీ ముఖంలో రాజయోగం కనిపిస్తోంది. త్వరలో నాలుగు చక్రాల వాహనాన్ని అధిరోహించగలవు"

గతంలో స్వామీజీ వాక్కు నిజమవడంతో అతడి మాటపై గురికుదిరింది.

అంతే బైకు విషయం విస్మరించి కారుకోసం కలలు కంటూ ముందుకు సాగిపోయాడు.

తన సైకిలు, మోటారుబైకు యోగానందంవల్లే దొంగిలింపబడ్డాయని, పోలీసురిపోర్టివ్వకుండా నిరోధించేందుకే అతడలా నాటకమాడుతున్నాడని తెలిస్తే ఏమైపోయేవాడో పాపం పాపారావు.

